
# హాస్యపదార్థం రుచి-శుచి

ప్రఖ్యా పూర్ణానందం



సినిక్ హాస్య శీలుడు కాడు. హ్యూమరిస్టు అండ్ ట్రైనేజి ఇన్‌స్పెక్టరు కాదు—పులుపు దృక్పథం కాదు కావలసింది; మధుర దృష్టి గుబాళించే నవ్వుల పువ్వులు ప్రసాదిస్తుంది.

నవ్వు లోభులుంటారు. నవ్వవలసిన తరుణంలో నవ్వక వచ్చిన నవ్వులు పొదుపు చేసి నిల్వ చేస్తారు; ఆవసాన దశలో వాటితో అనసరమేలేక అవికుళ్ళి పోతవి; పాతరవేస్తే ముక్కిపోయి మురిగిపోయి పనికి రాకుండా పోతవి. అంచేత వచ్చిన నవ్వు వచ్చినట్లు వెంటనే ఖర్చు చేయాలి కూడ బెట్టకూడదు, నవ్వులు పంచిపెట్టాలి. ఒకతను బ్రహ్మాండమైన జోక్ విసిరితే అతని బద్ధమిత్రుడు నవ్వలేదు. మిగతా వారువిరగబడి నవ్వారు. వారలు మూతి బిగింపుకు కారణ మడిగారు. ఆ విట్టులో మంచి విటమిన్సు వున్నమాట వాస్తవమే, కాని, అతనంటే నాకు దొబ్బిడాయి, యింటికి వెళ్ళి యెవరూ చూడకుండా వొంటరిగా నవ్వుకుంటాను, పదిమందితో బాటు నేను కూడా మెచ్చుకుంటే హెచ్చిపోతాడు' అని సమాధానం చెప్పుకున్నాడు ఆనిక్షేప రాయుడు.

కొందరు ఘక్కున నవ్వేరు. పళ్ళుబిగించి దాన్ని బయటకు రాకుండా అటకాయించి, దాన్ని చీల్చి ముక్క చెక్కలుచేసి వొక్కొక్క తుంపు చొప్పున



వాయిదాల పద్ధతినే వెలికి రానిస్తారు.

కొన్ని సందర్భాలలో నవ్వువస్తుంది, కాని నవ్వకూడదు. ఒకాయనభార్య చనిపోతే పరామర్శించటానికి మిత్రులు వెళ్ళారు. భార్య వియోగం పొందిన ఆయున (ఆంధ్రుడే సుమండీ) శవం దగ్గర కూలబడి 'ఓ, వాట్ వైఫ్ యే లవ్లీ వైఫ్, ఐ నెవర్ బెట్ యు, యు నెవర్ వెప్ట్, ఐ మే గెట్ సెకండ్ మాచ్, బట్ యు ఆర్ యే మాచ్ లెస్ వైఫ్, బాడ్ స్టార్, పొల్యూషన్ పొల్యూషన్, పికిల్సు గాన్, వాట్ ఎబౌటు జాడీస్ ... హూ విల్లీవ్ ఆవకాయ- ఇది వరస. ఏడవాలో నవ్వాలో తెలియక సాయంత్రం పార్కులో కూర్చుని తీరికగా చెప్పుకుంటూ నవ్వుకున్నారు. వొక చెంపజాలిపడుతూ.ఇంగ్లీషు భాషలా తెనుగయ్య శోకించటం విడ్డూరమే మరి!

పఠితకు, శ్రోతకు విట్టును వెంటనే అర్థం చేసికొని ఆనందించగల సామర్థ్యం వుండాలి, స్థాయి కావాలి, అప్పుడే ఆ జోక్ ప్రకాశిస్తుంది. పంచ్‌లో జోక్సు ఆంగ్లేయులలోనే చాలా మందికి సగలవు' యిహ అన్య భాషాపరుల అవస్థ చెప్పనక్కరలేదు. కొన్ని ఆంగ్ల చిత్రాలలో సంభాషణలలో వున్న స్వారస్యం మనలో మెజారిటీకి సుళువుగా బోధపడదు. కాని అందరూ నవ్వుతారు. కొద్దిమంది అమాయకంగా ప్రక్కవాడ్ని 'ఏమిటండీ విషయం' అని నోరు తెరిచి అడిగితే, 'నాకూ అర్థం కాలేదు, యేదో నల్గురితో పాటు నవ్వుతున్నాను' అంటాడు. వెనకటికి వో శాస్త్రులవారు పురాణం

చెబ్తుంటే శ్రోతల్లో కూర్చున్న వొక పూర్వ సువాసినీ రోజూ కళ్ళ వెంబడ నీళ్ళు కార్చేదట. శాస్త్రిగారు యిది గమనించి ఆమె శ్రద్ధకు శ్రవణానందాను భూతికి లోలోన మెచ్చుకుంటూ, ఒక రోజున ఆమెను డైరెక్ట్‌గా కన్నీటికి కారణమడిగాడు. "ఏమీ లేదండీ, మీ రామాయణగ్రంధాన్ని కట్టిన తాడు చూస్తుంటే కీర్తిశేషులైన మావారి మొల త్రాడు జ్ఞాపకమొచ్చి యేడుస్తున్నానందిట. ఛలోక్తులు శ్రోతకి అర్థం కాకపోతే నిరర్థకం.

ఒకరిని ఏడిపించి అయినా సరే సంస్కరించి సంఘంలో పదిమందిని నవ్వించి సుఖపెట్టే సదుద్దేశముతో ప్రయోగించ బడిన హాసము సుగర్‌తో మెదిపిన క్వైనా పిల్లు వంటిది. దెబ్బ తిన్న విక్టిమ్ కూడా ప్రయోగించిన ఆసామితో కలసి నవ్వుకో గలిగితే అది వుత్తమ హాస్యము. హాస్య వాక్యం రసాత్మకమై. రమణీయార్థ ప్రతిపాదకమై వుండవలె. అప్పుడే అది జీవం గల హ్యూమర్.

జీవన సంగ్రామంలో పోరాడి అలసిన జనావళికి వింతవీధులు చూపించాలి, ఆనందంతో పరవళ్ళు తొక్కుతారు. ఆ క్రొత్త మార్గాల పరుగిడి జీవితం ఆనంద మయం చేసుకొంటారు. నవ్వించే వారు నవ్వ గలిగేవారు కావాలి. ఏడ్చే వాళ్ళు, ఏడ్పించేవారు కొల్లలు. పాత భావాలతో పాతుకుపోయిన వారికి నాగరికతను నవ్వుతూ నవ్విస్తూ నేర్పాలి. హాస్యం విస్తరించాలి, ప్రత్యేకత సాధించాలి.

మానవుడు తనను జూచి తాను, నవ్వుకోగలిగితే జీవితములో బరువు తగ్గి తేలిక పడుతుంది. ఇలాంటి వారి సంఖ్యలో జాస్తిగా కూడిన జాతి బహు అరుదు. ప్రచండమైన మేధస్సుతో కూడిన విమర్శనా శక్తి, నిష్పాక్షికమైన, నిశితమైన, విశాల



మైన దృక్పథము అబ్బటం అందరికే సాధ్యమా? ఆంగ్లేయులు తమకా శక్తి పుష్కలంగా కలదని, సెన్సు ఆఫ్ హ్యూమర్ మెండని అతిశయం వెళ్ళబోస్తూ. స్కాచ్ దేశస్థులు హాస్యాన్ని వెంటనే అర్థం చేసికొనలేరని. యివాళ్ళ విన్న జోక్ కొన్ని వారాల దాకా అర్థంకాదని హేళన చేస్తారు. మరి, ఇంగ్లీషు వాళ్ళకి మాటల్లోని చమత్కారం వెంటనే స్ఫురించరని అమెరికన్లు యెద్దేవ చేస్తారు. ఏతాకతా, హాస్యపు పలుకులోని విద్యుద్వేగంతో మెరిసే చమత్కారం క్విక్కుగా గ్రహించుటకు చురుకైన బుర్ర, వాడియైన హాస్య రసదృష్టి ప్రధానంగా వుండాలి.

హాస్య వేత్తకు వక్రదృష్టి ఉండవలె. వర్ణనలు, అలంకారాలూ అట్టహాసం యేవీ లేకుండా నేమనస్సుకురంజింపచేసే హాస్య సృష్టి చేయగలడు. కవులకు పాండిత్యం, దివ్యదృష్టి కావాలి. కర్త తన ప్రతిభతో ప్రతి వస్తువును పరుసవేది స్పర్శ బంగారంలోకి మార్చగలడు. హాస్య శీలునికి విద్వత్తూ వ్యుత్పత్తీ వుంటే బంగారానికి సౌరభం అబ్బినట్లే—ముఖ్యంగా హాస్యవేత్తకు వికృతి దర్శనం కావలె.

పూర్వం పగటి భాగవతులు అర్థం పర్థంలేని పదములు అసందర్భంగా కూర్చి పేర్చినది మచ్చుకు చూడండి.

'అంబలి ముఖ్యంత్వ లంకారం
కంబళి ముఖ్యంతు భోజనం
రాట్నం ముఖ్యంతు నారీణాం
దుక్కి ముఖ్యంతు బ్రాహ్మణః॥
బాకీసార్లా సుమనసాసర్వదాయం
యథాక్రమం
తిన్నట్టే తినకున్నట్టే ఉన్న వారికి
మాడడం॥
మాట మాట ప్రసంగెన
దబ్బు దిబ్బు స్తధై వచ
పాదరక్ష ప్రయోగెన శరీరం
పటువగ్గయేత్॥


వేద పఠనంవలె ఉదాత్తానుదాత్తాది స్వరాలుకూడా కల్పించి చదివితే నవ్వు వస్తుంది. అసంబద్ధ ప్రయోగంలో వైపరీత్యం, వైచిత్రి సంతరించుకొన్నవి.

"కాచి కాచీ ములంకాయ
కాయవె పొట్టికాకరీ
కాయానాం వంగపిందానారి,
కూరానాం గుజ్జు పచ్చడిః॥

మంత్రాల్లాగా వాళ్ళు చమవుతుంటే తమాషాగా వుంటుంది. మేలిరకం కాకపోయినా, ముచ్చటైన హాస్యం.

సహజంగా వుండవలసిన గాంభీర్యం ఔచిత్యం ఉండక వికారము, విపరీతము. విచిత్రం ప్రవేశించి వ్యవహారము జరుగవలసిన విధంగా జరుగక ఉదాత్తత కోల్పోయినపుడు ఆ స్థితికి ఆ భాషారూపం వస్తుంది. రసాభాస. హేత్వాభాస, అలంకారాభాస, భావాభాస—యివన్నీ హాసజనితములే. వెతికితే పుష్కలంగా ముడి పదార్థందొరుకుతుంది. హాస్యంగా మాన్యుఫాక్చర్ చేసి మెరుగులు దిద్దాలంటే నిపుణులైన హాస్య కర్తలు విరివిగా బయలుదేరాలి. హాస్యాన్ని అర్థం చేసికొని ఆనందించడం అనుకున్నంత తేలిక అయినపని కాదు. భావ మైత్రి ఉన్న పాఠకుడు కావాలి. కర్త, భోక్త, సైదుష్యం కలవారైతే హ్యూమర్ శోభాయమానంగా ఉంటుంది.

మాటలు తడబడటంలో హాస్యం జనిస్తుంది. తొస్సు, తబ్బిబ్బు, తొట్రుపాటు స్పూనరిజంకు తావులు. ఒక మాటఅనబోయి యింకోమాట అంటారు. వర్ణక్రమంలో కూడ సన్నిహితమైన తేడా వస్తుంది. తొందర, గాభరా, తెలివితక్కువ తనం, సభా పిరికితనం వీటికి కారణాలు. సింప్లిటన్సు, పరధ్యానపరులుఅస్తవ్యస్తంగా పదాలు దొర్లిస్తారు. ఒకామె పెళ్ళి సంబరం వర్ణిస్తూ,




తన తమ్ముడికి వెండి బట్టలు పట్టు చెంబులు యిచ్చారని, విస్తళ్ళు తిని అన్నాలు పారేసేటప్పటికీ తెల్లగా కోడి కూసిందని ముచ్చటించింది. ఒకాయన వెనకటి చిత్రాలను గురించి చెబ్తూ 'దేవికా కుమార్, అశోకరాలాంటి స్టార్స్ అరుదు' అని వ్రాకుచ్చాడు. చిన్న కర్రనైనా పెద్దపామునో కొట్టాలని, హస్తకం పుస్త భూషణం అని అంటుంకస్తు. మరోమారు వివరిస్తాను.

ఇది మహిళా సంవత్సరం, కనుక వీరేశలింగంగారు సాంఘికాచారాలను ఆక్షేపిస్తూ స్త్రీకి తగినంత గౌరవం సాంసారిక జీవితంలో యివ్వటంలేదనిఅవహేళన చేస్తూ, మళయాళ దేశపు ఆచారాలని కల్పనతో వ్రాసినపద్యాలు కొన్ని ఉదహరిస్తా.

'స్త్రీ పాద తీర్థసేవన
మే పురుషుడు చేయునెన్ని
యేడులు ధరలో
నా పురుషుడన్ని యుగములు
పాపములం బాసి మోక్ష
పదవి సుఖించున్.
ప్రతి దినంబున పురుషుండు
పత్నికంటె
ముందుగా లేచి నదిలోన
మునిగి జలము
కలశమున దెచ్చి నిజపత్ని
కాళ్ళు గడిగి
తాను శ్రీపాద తీర్థంబు
త్రాగవలయు
పత్ని గొట్టినతిట్టిన బాధబడిన
భోగ పురుషుల బొందిన,
పొందకీర్ష్య
తరుణియె పురుషునకును
దైవమనుచు
భక్తిన నయంబు,
సేవింపవలయు జుమ్మి.'

ఎంత ఘాటైన శటైరో చూడండి అందున్న హాస్యం ఆరగించండి.

[సశేషం]

